

సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీపీవో సుశీలాదేవి

ఒకప్పట్లో ఊర్లో చెత్తను శివార్లలో పడేసేవారు. కొండల్లా పేరుకుపోయి దుర్గంధం నెలకొనేది. పర్యావరణ సమస్యతో పాటు స్థానికులూ అనారోగ్యం బారిన పడేవారు. 'స్వచ్ఛ పల్లె' నినాదంతో అలాంటి చెత్త నుంచి సంపద సృష్టించేలా ఏడేళ్ల కిందట సీఎం హోదాలో చంద్రబాబు రూపకల్పన చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటిని నిర్లక్ష్యంగా వదిలేయగా.. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వంలో లక్ష్యం దిశగా అడుగులేసింది. ఫలితం మూడు నెలల్లో జిల్లాలోని పంచాయతీలకు రూ.13.5 లక్షల ఆదాయం వచ్చింది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

చెత్త నుంచీ సంపద

- పంచాయతీలకు మూడు నెలల్లో రూ.13.5 లక్షల ఆదాయం
- వైసీపీ హయాంలో మూలనపడ్డ షెడ్లు
- కూటమి అధికారంలోకి వచ్చాక పునరుద్ధరణ



సంపద కేంద్రంలోని తొట్టెలో వర్మీకంపోస్టు తయారీ

చెత్త నుంచి సంపద సృష్టించాలి. తద్వారా పంచాయతీలకు ఆదాయంతో పాటు గ్రామాలూ పరిశుభ్రంగా ఉండాలి. ఇలా 'స్వచ్ఛ పల్లె' నినాదంతో 2019కి ముందే పంచాయతీల్లో సంపద కేంద్రాలను సీఎం చంద్రబాబు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది సాకారం దాల్చే సమయానికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వం సంపద కేంద్రాలను నిర్లక్ష్యం చేసింది. స్వచ్ఛ పల్లెలు అనేది మొక్కుబడిగా మారింది. ఊరి చివరన ఉన్న సంపద కేంద్రాలు మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రూ.వేలల్లో ఖర్చుపెట్టి నిర్మించిన తొట్టెలు శిథిలావస్థకు చేరాయి. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేలా చంద్రబాబు ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో తిరుపతి జిల్లాలో చెత్త సంపదకేంద్రాలపై కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టి సారించారు. జిల్లాలో 774 పంచాయతీలున్నాయి. వీటిలో 610 పంచాయతీల్లో యుద్ధప్రాతిపదికన చెత్త సంపద కేంద్రాలను(ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు) పునరుద్ధరించారు. కలెక్టర్‌తో పాటు డీపీవో సుశీలాదేవి, ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కో ఆర్డినేటర్ శిరీష ఈ కేంద్రాలను పర్యవేక్షిస్తూ వచ్చారు. గత మూడు నెలలుగా ప్రతి ఇంటి నుంచి తడి.. పొడి చెత్త విడివిడిగా సేకరించడానికి పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించారు. తడి చెత్తతో వానపాముల ఎరువుల తయారీ (వర్మీకంపోస్టు), పొడిచెత్తను రీసైక్లింగ్ చేస్తున్నారు. సంపద కేంద్రాలకు చేరే చెత్తను 45 రోజులపాటు తొట్టెల్లో మగ్గపెట్టి తరువాత వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. మార్కెట్లో కిలో రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. పచ్చదనంతో అత్యంత సుందరంగా చెత్తసంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వర్మీకంపోస్టు ద్వారా రూ.13.5 లక్షలు

జిల్లాలో శానిటేషన్ వర్కర్లు, క్లాప్ మిత్రలు 2,527మంది పనిచేస్తున్నారు. వర్మీకంపోస్టు తయారీలో వీరంతా భాగస్వాములే. గడిచిన మూడు నెలల్లో వర్మీకంపోస్టు అమ్మకం ద్వారా రూ.13.5 లక్షల ఆదాయం పంచాయతీలకు చేకూరింది. కొన్ని పంచాయతీల వారు జాతీయ రహదారులు, గ్రామ కూడళ్లతో పాటు పంచాయతీ కార్యాలయాలు, కలెక్టరేట్‌లోనూ వర్మీకంపోస్టు విక్రయిస్తున్నారు.

ఆదాయాన్ని పంచాయతీలకే కేటాయిస్తున్నాం

జిల్లాలో 610 పంచాయతీల్లో చెత్త నిర్వహణ కేంద్రాలను అమల్లోకి తెచ్చాం. త్వరలో మిగిలిన వాటినీ వినియోగంలోకి తెస్తాం. మూడు నెలల్లోనే వర్మీకంపోస్టు విక్రయం ద్వారా రూ.13.5 లక్షలు పంచాయతీలకు ఆదాయం వచ్చింది. ఈ ఆదాయాన్ని నాలుగింతలు రెట్టింపు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. వర్మీకంపోస్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ పంచాయతీల అభివృద్ధికే కేటాయిస్తాం.

- వెంకటేశ్వర్, కలెక్టర్



రేణిగుంట మండలం తూకివాకం వద్ద హైవేపై వర్మీకంపోస్టు విక్రయం





వడమాలపేటలోని చెత్తసంపద కేంద్రం - తొట్టెలో మగ్గబెట్టిన వ్యర్థాలు

రేషనలైజేషన్ షురూ

సచివాలయాల్లో క్లస్టర్లవారీ విభజన పూర్తి

మిగులు సిబ్బంది 700 నుంచి 800 మంది

తిరుపతి (కలెక్టరేట్)/తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సేవలను మరింత చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించే కార్యక్రమం పూర్తయింది. సంబంధిత విధివిధానాలు తయారుచేయాలని సచివాలయ పాలన విభాగానికి, మండలపరిషత్‌లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేయగా, అధికారులు వారం క్రితం పూర్తిచేశారు. దీంతో జిల్లా యంత్రాంగం క్లస్టర్ల విభజన ప్రారంభించి కసరత్తుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

జిల్లాలో సచివాలయాలు: 691
(అర్బన్ 207, రూరల్ 484)
ప్రతిపాదిత క్లస్టర్లు : 352
(అర్బన్ 105, రూరల్ 247)
ఉద్యోగులు: సుమారు 5600 మంది
మిగులు ఉద్యోగులు : 700 - 800 మధ్య

విభాగాలుగా సిబ్బంది

గ్రామ సచివాలయాల్లో 11 మంది, పట్టణాల్లో 9 మంది చొప్పున సిబ్బంది ఉంటారు. ప్రస్తుతం వీరిని పలు విభాగాలుగా విభజించారు.

- బహుళార్థక విభాగంలో నాలుగు కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరు సర్వేలు చేపడతారు. ఇతర సేవలను క్లస్టర్ స్థాయిలో అందిస్తారు.
- సాంకేతికత విభాగంలో వ్యవసాయ, సెరికల్చర్, ఉద్యాన, ఇంజనీరింగ్, ఆరోగ్య, పశు సంవర్థక, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ సహాయకులు ఉంటారు.
- ఐటీలో ప్రవేశమున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉద్యోగులను గుర్తించి ఇన్ఫర్మేషన్ విభాగంలో చేర్చుకున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించనున్నారు.
- రెవెన్యూ విభాగంలో వీఆర్వోలు, సర్వేయర్లు ఉంటారు. మహిళా పోలీసులను ఐసీడీఎస్ విభాగంలో లేదా పోలీసు స్టేషన్లలో నియమించనున్నారు. అయితే పలువురు పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహించడానికి సుముఖత చూపడం లేదు.

ఎంపీడీవోల ఆధ్వర్యంలో...

ప్రతి మండలంలో పక్కపక్కన ఉన్న సచివాలయాలను క్లస్టర్లుగా పరిగణిస్తారు. సచివాలయాలు సరిసంఖ్యలో ఉంటే సగం క్లస్టర్లు ఏర్పాటవుతాయి. ఉదాహరణకు 12 సచివాలయాలుంటే ప్రతి క్లస్టర్‌లో ఆరేసి సచివాలయాలను ఏర్పాటుచేస్తారు. బేసి సంఖ్యలో ఉంటే ఒక క్లస్టర్ పరిధిలోకి రెండు సచివాలయాలను తీసుకొస్తారు. బహుళార్థక విభాగంలో జనాభా ప్రాతిపదికన, సాంకేతిక విభాగంలో క్లస్టరు పరిధిలో ఉద్యోగులను గుర్తిస్తారు. వీరు రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంటుంది. క్లస్టర్ల విభజన పనిని ఎంపీడీవోలు పూర్తిచేశారు. 2500 జనాభా ఉన్న చోట ఆరుగురు, 2501 నుంచి 3500 మంది ఉన్న చోట్ల ఎనిమిది మంది, ఆపై జనాభా ఉన్న సచివాలయాల పరిధిలో 10మందిని నియమించేలా నివేదికలు తయారుచేశారు.ఈ లెక్కన ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న సుమారు 5600 మందిలో 700-800 మధ్యలో మిగులు ఉద్యోగులు ఉండొచ్చని అంచనా. వీరిని ఏయే శాఖల్లో నియమించాలన్న దానిపై ఇంకా ప్రభుత్వం నుంచీ స్పష్టత రాలేదు.



గాలివానకు నేలకొరిగిన భారీ వృక్షం

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో పట్టణంలో గురువారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో కొత్తపేటలోని రోడ్డు పక్కనున్న భారీ చింత చెట్టు నేలకొరిగింది. ఇది సమీపంలోని విద్యుత్ తీగలపై పడటంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఓ హోటల్ ముందు రేకుల షెడ్డు కూలిపోయింది. జాతీయ రహదారిలో తీగలపై ఫ్లెక్సీలు పడటంతో సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



పన్ను వసూళ్లలో తిరుపతి మూడోస్థానం

- కమిషనర్ల సదస్సులో మౌర్యకు సన్మానం



కమిషనర్ మౌర్యను అభినందిస్తున్న మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేష్, సీడీఎంఏ సంపత్‌కుమార్

తిరుపతి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లలో తిరుపతి నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం నిలిచినందుకు తిరుపతి కమిషనర్ ఎన్.మౌర్యను ప్రత్యేక కార్యదర్శి సురేష్, సీడీఎంఏ సంపత్‌కుమార్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. తిరుపతి నగర పాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.100కోట్ల వివిధ రకాల పన్ను చెల్లింపులు జరిగాయి. ఆస్తిపన్ను రూ80.44కోట్లు, ఖాళీస్థలాల పన్ను (వీఎల్టీ) రూ9.92కోట్లు, నీటి పన్ను రూ8.18కోట్లు, మురుగునీటి పన్ను రూ1.50కోట్లు పన్నుల రూపంలో కార్పొరేషన్ ఖాతాలోకి చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.84కోట్లు మాత్రమే వసూలు కాగా, ఈసారి వంద కోట్ల మార్కు దాటడంతో పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో తిరుపతి మూడో స్థానంలో నిలిచింది. ఖాళీ స్థలాల పన్నులు చెల్లించడంలో తొలి నుంచీ కార్పొరేషన్ వెనుకంజలో ఉంది. ఎంత ఒత్తిడి చేసినా రూ4కోట్లు పైన వసూలైన సందర్భాలు లేవు. ఖాళీ స్థలాల యజమానులు స్పందించకపోతే ప్రభుత్వ స్థలమని బోర్డులు పెడతామని.. వీఎల్టీ చెల్లించకుంటే టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు నిబంధనలు ఒప్పుకోవని కమిషనరు చెప్పడంతో ఈ ఏడాది దాదాపు రూ10కోట్లు వసూలయ్యాయి. టీటీడీ నుంచి రావాల్సిన కొన్ని ఆస్తులకు సంబంధించిన పన్నుల వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈమొత్తాన్ని మినహాయిస్తే రాష్ట్రంలోనే తిరుపతి నగరపాలక సంస్థ పన్ను వసూళ్లలో మొదటి స్థానంలో ఉన్నట్టేనని రెవెన్యూ అధికారి ఒకరు చెప్పారు.

తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలం

- ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ నరసింగప్ప పెనుగొండకు బదిలీ



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డీఎస్పీగా భక్తవత్సలం నియమితులయ్యారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటనారాయణను ప్రభుత్వం నెల కిందట బదిలీ చేసిన విషయం విదితమే. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు. ఆ పోస్టులో ప్రస్తుతం భక్తవత్సలంను ప్రభుత్వం నియమించింది. 1991లో ఎస్ఐగా పోలీసు శాఖలో అడుగుపెట్టిన ఈయన కర్నూలు జిల్లాలో పలుచోట్ల పనిచేశారు. 2005లో సీఐగా పదోన్నతి పొంది కౌంటర్ ఇంటెలిజెన్స్‌లో, డోన్, ములకలచెరువు, మళ్లీ డోన్, కోడుమూరులో పనిచేశారు. 2014 ఎన్నికల్లో సత్యవేడు సీఐగా నియమితులయ్యారు. అక్కడే డీఎస్పీగా పదోన్నతి పొందారు. తర్వాత వివిధ చోట్ల పనిచేసిన ఆయన 2024 ఎన్నికల్లో ప్రొద్దుటూరు డీఎస్పీగా పనిచేశారు. అక్కడి నుంచి కొన్ని రోజులు వీఆర్‌లో ఉంటూ ప్రస్తుతం తిరుపతి డీఎస్పీగా నియమితులయ్యారు. ఇక, తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న నరసింగప్పను అనంతపురం జిల్లా పెనుగొండకు ప్రభుత్వం బదిలీ చేసింది.

విద్యుత్తు తీగలు తగిలి ఎలుగుబంటి మృతి!

భాకరాపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):. విద్యుత్ తీగలు తగిలి ఓ ఎలుగుబంటి మృతి చెందింది. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచర్ల పంచాయతీ తుమ్మసేనపల్లి అటవీ సరిహద్దు ప్రాంతంలో పెదనాయన చెరువు సమీపంలో అడవి జంతువుల కోసం పెట్టిన విద్యుత్ తీగలు తగిలి గురువారం మృతి చెందినట్లు సమాచారం. దీనిపై అటవీ అధికారులు తమకు సమాచారం లేదని చెబుతున్నారు. కొన్ని రోజులుగా ఈ ప్రాంతాల్లో అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు పెడుతున్నారు. జంతువులు బలైపోతున్నాయి. ఇటీవల కరెంట్ తీగలు తగిలి ఓ ఏనుగు చనిపోయింది.





ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న దివ్యాంగులు

వైద్యుల కోసం దివ్యాంగుల పడిగాపులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అంగ వైకల్యం సర్టిఫికెట్లను పునఃపరిశీలించే ప్రక్రియను ప్రభుత్వం మొదలుపెట్టింది. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దివ్యాంగులకు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో గురువారం పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10గంటలకే దివ్యాంగులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వైద్యులు రాకపోవడంతో వీరంతా ఇబ్బంది పడ్డారు. ఎండకు తాళలేక, మధ్యాహ్నం తిండి లేక అలమటించారు. నడవలేని వారు ఆటోల్లోనే నిరీక్షిస్తూ ఉన్నారు.

వసంతోత్సవం

వనంలా సెట్టింగు. అందులో సింహం, పులులు, కోతులు, కుందేళ్లు, ఎలుగుబంటి, జింకల బొమ్మలు. ఇలా శేషాచల అడవిని తలపించేలా తిరుమలలోని వసంత మండపాన్ని తీర్చిదిద్దారు. వసంతోత్సవాల్లో భాగంగా అక్కడి వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి గురువారం స్నపన తిరుమంజనం నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







వైసీపీ అసత్య ప్రచారం మానుకోవాలి : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాకాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని మండల టీడీపీ నాయకులు కోరారు. స్థానిక మండల టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ నాయకులు బి.నాగరాజ నాయుడు, బి.ఈశ్వరచౌదరి, ఫల్గుణ, టిజె ప్రవీణ్, డి.మోహన్‌నాయుడులు మాట్లాడారు. ఇరంగారిపల్లె సమీపంలో బుధవారం పార్టీ వ్యవహారాల గురించి చర్చించుకుంటే వైసీపీ నాయకులు సోషల్ మీడియా, బ్లూ మీడియాలో గొడవలతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. దాడులు చేసుకోవడం తమ సంస్కృతి కాదన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతుంటే సహించలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. సమావేశంలో రెడ్డిప్రసాద్, రమేష్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శక్తి కాళీ హోమం



రామచంద్రాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తిపీఠం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువార శాస్త్రోక్తంగా కాళీ హోమం జరిగింది. ఆలయంలో మరకత శక్తి కాళీ అమ్మవారితో పాటు ప్రత్యుంజర, వారాహిదేవికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు ఉదయం 9గంటలకు వేదపండితులు వేదమంత్రోచ్చరణల మధ్య హోమం నిర్వహించగా మధ్యాహ్నం 12గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తీపీఠాధిశ్వరి రమ్యానందభారతి స్వామి పూర్ణాహుతితో హోమం ముగించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ మేళతాళాల నడుమ జరిగింది. పీఠాధిపతులు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.

వైభవంగా జగదభిరాముడి కల్యాణం


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొత్తకండ్రిగలో కోదండరామస్వామికి గురువారం కల్యాణం జరిగింది. తొలుత ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించి కల్యాణవేదిక వద్ద కొలువదీర్చారు. అక్కడ వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, దొర ప్లాస్టిక్ సంస్థ అధినేత లత, కేశవులునాయుడు దంపతులు, టీడీపీ నాయకులు తిరుమలరెడ్డి, జనార్దన చౌదరి, హరిప్రసాద్, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి పాల్గొన్నారు. **తిరుపతి రూరల్:** దుర్గసముద్రం రామాలయంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాత పెన్నగడ్డం శివయ్య, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై కోదండరాముడు



చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో గురువారం సాయంత్రం స్వామి హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి కన్నులపండువుగా ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం హనుమంతు వాహనంపై అదిష్టింప జేసి స్వామివారిని ఊరేగించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, టెంపల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాసబట్టర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తసంపద తయారీ కేంద్రాలపై అవగాహన



తిరుపతిరూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపల్లెలోని ఎస్‌డబ్ల్యూవీసీ లోకల్‌సెంటర్‌లో జిల్లాశిక్షణా వనరులకేంద్రం ఆధ్వర్యంలో గురువారం విలేజ్ శానిటేషన్-చెత్తసంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు మండలాలకు చెందిన ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో జిల్లా డీపీఆర్సీ(కోఆర్డినేటర్) శిరీష అవగాహన కల్పించారు. చెత్తనిర్వహణను శాస్త్రీయ పద్దతుల్లో చేపట్టాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్లు భరత్‌కుమార్, కిశోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, మండల కో-ఆర్డినేటర్ శరత్, ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



తిరుపతి రూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లెలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. మందులు పంపిణీ చేశారు. వన్నియకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, జనసేన ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కార్పొరేషన్ డైరెక్టర్ అయ్యంగారు బాలసుబ్రమణ్యం, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు కిరీటికృష్ణ, జనసేన నాయకులు రంగారెడ్డి, మౌళి, పాల్గొన్నారు.

21మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతిరూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల చెందిన 21మంది విద్యార్థులు షిరిడీసాయి ఎలక్ట్రికల్ సంస్థ (కడప)లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ ఈమేరకు పేర్కొన్నారు. వీరికి గురువారం నియామకపత్రాలను అందజేశారు. విద్యార్థులను చైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథన్, హెడ్లు బాలసుబ్రమణ్యం, భాస్కర్, అధ్యాపకులు అభినందించారు.

నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోండి

తిరుపతి రూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో నీటిసమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. గురువారం వేదాంతపురంలోని ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంక్‌ను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అవిలాల, గాంధీపురం, లింగేశ్వరనగర్, శ్రీనివాసపురం పంచాయతీల్లో నీటిసమస్య రాకుండా చూడాలన్నారు. వేదాంతపురం పంచాయతీలో రెండు కొత్త బోర్లు మంజూరు చేసి వేసవిలో నీటి ఎద్దడిని నివారించాలని ఆదేశించారు. ఎంపీడీవో రామచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంత్‌కుమార్, టీడీపీ రూరల్‌మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, నాయకులు మధు, శ్రీధర్‌నాయుడు, మునిశేఖర్‌రాయల్, సర్పంచఉలు వెంకటరమణ,జనార్దన్‌యాదవ్, కోటేశ్వరరావు, లక్ష్మీశివ, ముసుగు కోటేశ్వరరావు, లక్ష్మీరాజ తదితరులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి నేటి నుంచి అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి బస్సులు తిరుపతి నుంచి బయల్దేరుతాయని, ప్రతి 15 నిమిషాలకు శ్రీనివాస బస్టాండు 27వ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉంటాయని వివరించారు. ఆదివారం ఉదయం 9 గంటల వరకు తిరువణ్ణామలైలో చివరి బస్సు తిరుపతికి బయల్దేరుతుందని పేర్కొన్నారు. సాధారణ చార్జీలే ఉంటాయని, రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సప్తగిరికి ఎమ్మెల్యేల పరామర్శ


సప్తగిరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్

తిరుపతిరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీకి చెందిన సినీనటుడు సప్తగిరిని గురువారం చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ పరామర్శించారు. రెండ్రోజుల క్రితం సప్తగిరి తల్లి చిట్టెమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. గురువారం శ్రీనివాసపురంలోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యేలు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జ్యోతిరావు పూలేకి నివాళులు

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక స్వమాక్స్ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వమాక్స్ సీఈవో సంగీతం విశ్వనాథ్ మాట్లాడుతూ విద్య సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహా గొప్ప వ్యక్తి పూలే అని శ్లాఘించారు. నేటి యువకులు, రాజకీయ నాయకులు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. స్వమాక్స్ అధ్యక్షురాలు శివకుమారి, కార్యవర్గ సభ్యులు షర్మిల, నారాయణమ్మ, పద్మశ్రీ, జగదీశ్వరి, సిబ్బంది రామనాథరెడ్డి, సుబ్రమణ్యం, ఉమ, జయరామరెడ్డి, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీలకు పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):పంచాయతీరాజ్ శాఖ ప్రక్షాళనలో భాగంగా పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదట ఉద్యోగుల క్యాడర్ విషయంలో తారతమ్యాలు లేకుండా చేయాలని నిర్ణయించారు. ఈవోపీఆర్డీ క్యాడర్‌ను డిప్యూటీ ఎంపీడీవోలుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఈవోపీఆర్డీలుగా పని చేస్తున్న 23 మంది క్యాడర్ డిప్యూటీ ఎంపీడీవోలుగా మారనుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జిల్లాలోని ఈవోపీఆర్డీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21న మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష

చిత్తూరు(సెంట్రల్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో ఆరవ తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్టు పాఠశాల విద్యాశాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 20న ఈస్టర్ పర్వదినం రావడంతో ఈ మేరకు మార్పు చేసినట్టు ప్రకటించింది. జాతీయ విద్యా విధానం అమలుకు స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చైర్మన్‌గా,ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, అధికారులు సభ్యులుగా వుంటారు.

నత్తనడకన ఈతకొలను ఆధునికీకరణ


నత్తనడకన పెద్దల ఈత కొలను పనులు


పిల్లల ఈత కొలను

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఈతకొలను ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2001లో ఏర్పాటు చేసిన ఈ స్విమ్మింగ్ పూల్ పాతబడడంతో స్మార్ట్‌సిటీ నిధులతో 2019లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. పనులు నాసిరకంగా చేయడంతో కొంతకాలానికే కళ తప్పింది. గుర్తించిన శాప్ చైర్మన్ రవి నాయుడు పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని రూ.12 లక్షలు శాప్ నిధులు మంజూరు చేయించారు. ఫిబ్రవరి 15న ప్రారంభమైన పనులు ఇంకా కొనసాగుతుండడం విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ చైర్మన్ పలుమార్లు సందర్శించి, పనుల ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏప్రిల్ 10న పునఃప్రారంభించేలా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. చివరి దశకు చేరుకున్నా మిగిలిన పనులు పూర్తికావడానికి మరికొన్ని రోజులు పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయినా వేసవిలో ఈత కొలను మరమ్మతులు చేయడమేంటని స్విమ్మింగ్ ప్రియులు పెదవి విరుస్తున్నారు.

మహిళలకు ముగిసిన టైలరింగ్ శిక్షణ


శిక్షణ పొందిన మహిళలతో సుధారెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్వర్ణ నారావారిపల్లిలో భాగంగా టైలరింగ్, టెక్స్‌టైల్ ప్రింటర్‌లలో 60 మందికి నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. కేంద్ర ప్రభుత్వ సంకల్ప పథకం కింద బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నాని సతీమణి సుధారెడ్డి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. శిక్షణ పొందిన వారికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తారన్నారు. బ్యాంకుల రుణసౌకర్యంతో జీవనోపాధిని మెరుగుపరిచేలా ప్రభుత్వం కృషి జరుగుతోందన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లను అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం, ఏపీఎం గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరాజు అన్నారు. గురువారం చంద్రగిరిలో అసెంబ్లీ క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆయనతోపాటు జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, పార్టీ నాయకులు పెనుబాల చంద్రశేఖర్, వెంకటముని పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టినటువంటి కేంద్ర సంక్షేమ అభివృద్ధి పథకాలను గ్రామస్థాయికి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిపురం కాలనీలో నగదు, నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ హరిపురం కాలనీలో బుధవారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. హరిపురం కాలనీలో కాపురముంటున్న పాకాల కుమార్ భార్య ఆరోగ్యం బాగలేకపోవడంతో తుమ్మలగుంటలోని ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్లి బుధవారం రాత్రి 10.30 గంటలకు ఇంటికి వచ్చారు. భోజనం అనంతరం భార్య, కుమార్తెతో కలసి రెండవ అంతస్తులో ఉన్న పెంట్ హౌస్‌లో తలుపులు తెరచి నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.1.20 లక్షల నగదు, 30 గ్రాముల బంగారు తాళిబొట్టు, రెండు మొబైల్ ఫోన్లు అపహరించుకుని వెళ్లారు. తెల్లవారుజాము 3 గంటలకు లేచి చూడగా ఇంట్లో వస్తువులు కనిపించక పోవడంతో ఉదయం రూరల్ సీఐ చిన్న గోవిందుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మేనాటికి పీఏసీ-5 సిద్ధం

● 15 వేల మంది భక్తులకు వసతి

తిరుమల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం-5(పీఏసీ) భవన నిర్మాణం పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఈ నిర్మాణంతో 15 వేల మందికి వసతి సమకూరుతుంది. కొండ మీద ప్రస్తుతం 7,500 గదుల ద్వారా 30 వేల నుంచి 40 వేల మందికి వసతి కల్పిస్తున్నారు. రోజూ లక్షమందికి పైగా భక్తులు వస్తున్న క్రమంలో వసతి కష్టాలు అధికంగా ఉంటున్నాయి. కొత్త నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలున్న క్రమంలో ప్రస్తుతమున్న నాలుగు పీఏసీల తరహాలో మరో భారీ భవనాన్ని నిర్మించాలని 2022లోనే నిర్ణయించింది. ఈక్రమంలో ప్రస్తుతమున్న పీఏపీ-3 ఎదుట పీఏసీ-5ను నిర్మించేందుకు రూ.99 కోట్లను కేటాయించింది. 2023లో ప్రారంభమైన భవనం పనులు ప్రస్తుతం 90శాతం పూర్తయ్యాయి.కొత్త పీఏసీని మేనాటికి భక్తులకు అందుబాటులోకి తేవాలని టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు పనులు వేగవంతం చేశారు. చిన్నపాటి ఇంజినీరింగ్ పనులు, విద్యుత్, నీటి సరఫరా వంటి పనులు జరుగుతున్నాయి. ఇందులోని సబ్‌సెల్లార్‌లో వంటశాలను ఏర్పాటు చేయనున్నారు. సెల్లార్‌లో దాదాపు వంద కార్ల పార్కింగ్‌కు వీలుగా ప్రణాళిక సిద్ధం చేశారు. మూడు అంతస్థుల్లో 16 హాళ్లను ఏర్పాటు చేయనున్నారు. 200 మరుగుదొడ్లు, 200 స్నానపుగదులు అందుబాటులోకి తీసుకురానున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భాకరాపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు జంగావాండ్లపల్లి పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులు బాలింతలు, పిల్లలు, తల్లులు రోజూ అంగన్వాడీ కేంద్రాల పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు పౌష్టికాహారాన్ని ప్రదర్శన నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పి నస్రిన్, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు హేమలత, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ వైదిక కత్యవులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు.

డ్రామాలు ఆపకుంటే సర్పంచిగానూ గెలవవు

● జగన్‌పై ఎంపీ కేశినేని చిన్ని విమర్శ

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఇకనైనా డ్రామాలు ఆపకుంటే మాజీ సీఎం జగన్ పులివెందుల సర్పంచిగా కూడా గెలవరని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విమర్శించారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పనికిమాలిన కామెంట్లు, డ్రామాలు చేసే అధికారం కోల్పోయామని ఇంకా జగన్‌కు అర్థం కాలేదన్నారు. అద్దం ధ్వంసమైతే హెలికాప్టర్ టేకాఫ్ ఎలా అవుతుందని గ్రహించక పోలీసులను టార్గెట్‌చేసి బట్టలూడదీస్తామనడం సిగ్గుచేటన్నారు. దూషించేటప్పుడు మహిళా పోలీసులు ఉంటారన్న జ్ఞానం కూడా లేకపోతే ఎలాగని నిలదీశారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలంటూ ఫిర్యాదు


రోవర్ కెమెరాతో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఫిర్యాదు అందడంతో రెవెన్యూ సిబ్బంది గురువారం సర్వే నిర్వహించారు. మంగళం-శెట్టిపల్లి మార్గంలోని మంగళం లెక్కదాఖలు సర్వే నెంబరు 116/2లో నిర్మాణాలు జరుగుతున్నాయని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో సర్వేయర్ జగదీష్, వీఆర్వో సతీష్, విలేజ్ సర్వేయర్ శ్రీనివాస్ కలసి రోవర్ కెమెరా సాయంతో ఆ ప్రాంతంలో సర్వే నిర్వహించారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన తర్వాత నిర్మాణాలు చేపట్టిన స్థలం ప్రభుత్వానిదా కాదా అని నిర్ధారించనున్నారు.

నేడో, రేపో ఏఎంసీ పోస్టుల భర్తీ

● ఎమ్మెల్యేల సిఫార్సులే ఫైనల్

చిత్తూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టుల భర్తీ కసరత్తు పూర్తయి చాలాకాలమైనా ప్రకటించడంలో ఆలస్యమవుతోంది. జిల్లాలో మొత్తం 10 పోస్టులుండగా, రెండు చోట్ల మాత్రమే ఇటీవల ప్రకటించారు. జిల్లాలోని అన్ని పోస్టులకు పేర్లను అప్పట్లోనే ఖరారు చేసినా మరో 8 పోస్టులను మాత్రం ప్రకటించలేదు. వీటిని రెండు మూడు రోజుల్లో ప్రకటించే అవకాశాలున్నట్లు ఎమ్మెల్యేలకు సమాచారం అందింది. అధికార పార్టీ ఎమ్మెల్యేలున్న చోట్ల వారు సూచించిన నేతలను, లేని చోట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జులు సిఫార్సు చేసిన పేర్లనే అధిష్ఠానం ఖరారు చేసినట్లు సమాచారం. అయితే వారు సిఫార్సు చేసిన నేతల సేవలను టీడీపీ అధిష్ఠానం మరో ఛానెల్ ద్వారా చెక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ విజయానికి కృషి చేసినవారికే చైర్మన్‌గిరి దక్కుతున్నట్లు చెబుతున్నారు.చైర్మన్ పోస్టులు టీడీపీకి దక్కనుండగా కొన్ని డైరెక్టర్ పోస్టుల్లో జనసేన, బీజేపీ నాయకులకు అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది.ఇదివరకే ప్రకటించిన ఎస్‌ఆర్‌పురం, నగరి మార్కెట్ కమిటీ చైర్మన్ల పోస్టులను ఎమ్మెల్యేలు వీఎం థామస్, గాలి భానుప్రకాష్ సిఫార్సు చేసిన వారికే ఇచ్చారు. ఎస్‌ఆర్‌పురంలో థామస్‌కు ముఖ్య అనుచరుడు గుండయ్య సతీమణి జయంతికి, నగరిలో టీడీపీ పుట్టుక నుంచీ పార్టీలోనే కొనసాగుతున్న సీనియర్ నేత సుబ్రమణ్యం రాజు సతీమణి రాజమ్మ పేర్లను ఖరారు చేశారు.● జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఖాళీగా వున్న పెనుమూరు ఏఎంసీ చైర్మన్ పోస్టుకు జీడీనెల్లూరు మండలం పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరుకు చెందిన వ్యాపారవేత్త వై.కృష్ణమ నాయుడి పేరును ఎమ్మెల్యే సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది● చిత్తూరు మార్కెట్ కమిటీకి గత ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన మాపాక్షికి చెందిన బీసీ నేత వెంకటేష్ యాదవ్ పేరును తొలుత ఖరారు చేశారు. రిజర్వేషన్ల అడ్జస్ట్‌మెంట్లలో భాగంగా ఆయన సతీమణికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది● పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని బంగారుపాళ్యం మార్కెట్ కమిటీకి తవణంపల్లె మండలానికి చెందిన భాస్కర నాయుడి పేరును నియోజకవర్గంలోని నాయకుల సమ్మతితో ఎమ్మెల్యే మురళీమోహన్ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఒకటే కమిటీ ఉండగా.. స్థానిక కీలక నాయకులు మూడు పేర్లను సూచించారు. ఈ ముగ్గురిలో ఒకరిని ఎంపిక చేసి ప్రకటించనున్నారు.● పలమనేరులో ఒకటే మార్కెట్ కమిటీ ఉండగా.. అక్కడ ఎస్సీ రిజర్వేషన్ ఉండగా, మరోసారి బీసీ మహిళ రిజర్వేషన్ వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పలమనేరు చైర్మన్ పేరును ఖరారు చేయనట్లు తెలుస్తోంది.● పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, రొంపిచెర్ల, సోమలలో మార్కెట్ కమిటీలున్నాయి. ఇక్కడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆయా పేర్లను ఖరారు చేసి అధిష్ఠానానికి పంపారు.

రోడ్డుపైనే ట్రావెల్స్ బస్సులు

● ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అత్యంత రద్దీగా ఉండే ఈస్ట్ పోలీసు స్టేషన్ రోడ్డుపై ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. సాయంత్రమైతే సగం రోడ్డు ఆక్రమించి బస్సులను నిలిపేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. గురువారం రాత్రి సాక్షాత్తూ ఒక పోలీసు అధికారి ఆ మార్గంలో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. సుబ్బులక్ష్మి సర్కిల్ నుంచి మయూర హోటల్ వరకు, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న అంబేడ్కర్ సర్కిల్ వద్ద ట్రావెల్స్ బస్సులు పదుల సంఖ్యలో సాయంత్రం 6నుంచి రాత్రి 11 గంటల వరకు నిలబెట్టి ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నారు. బెంగళూరు, హైదరాబాదు, విజయవాడ, చెన్నై, వైజాగ్, రాజమండ్రి, గుంటూరు ప్రాంతాలకు ప్రతిరోజూ దాదాపు 70 బస్సులు ఈ ప్రాంతం నుంచి వెళుతున్నాయి. నిత్యం రద్దీగా ఉంటున్న ఆ మార్గంలో రోడ్డుకు అడ్డంగా బస్సులు నిలిపేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. గతంలో భారతి బస్టాండు వద్ద ట్రావెల్స్ బస్సులకు పాయింట్ ఉండేది. కానీ మళ్లీ పాత పద్ధతినే అనుసరిస్తున్నా అటు అధికారులు గాని, ఇటు పోలీసులు గాని మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది.


రోడ్డును ఆక్రమించిన ట్రావెల్స్ బస్సులు

కొబ్బరిచెట్టుపై పిడుగు



రామచంద్రాపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపల్లి, వేపకుప్పం గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అప్పటివరకూ ఎండతీవ్రతతో అల్లాడిన ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి. నెవ్వమళ్లగుంటపల్లి సమీపాన పొలంలోని ఓ కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు.

మేకల బండ నవలకు పురస్కారం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఆర్సీ కృష్ణ స్వామి రాజు రచించిన మేకల బండ నవలకు గోవిందరాజు సీతాదేవి సాహితీ పురస్కారం లభించింది. ఈ నెలాఖరున జరగబోయే కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకురాలు గోవిందరాజు సుభద్రా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జనరిక్ మందులు కొన్న నారాయణ


నారాయణను సన్మానిస్తున్న కె.వి.చౌదరి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సౌకర్యార్థం జనరిక్ మందులు అందుబాటులో ఉంచాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్.కె.నారాయణ కోరారు. గురువారం ఆయన తిలక్ రోడ్డులోని ఎస్‌బీబీ మెడికేర్‌ను సందర్శించారు. తనకు అవసరమైన మందులను కొనుగోలు చేశారు. జనరిక్ మందులను డిస్కౌంట్ ధరలకు విక్రయించి పేదలకు సేవ చేయాలని సూచించారు. అన్ని మెడికల్ షాపుల్లో ఇదే విధానం కొనసాగించాలని ఆయన నిర్వాహకులను కోరారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎస్‌బీబీ మెడికేర్ అధినేత, తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ కె.వి.చౌదరి సన్మానించారు. సీపీఐ నాయకులు మురళి, రామానాయుడు ఆయన వెంట ఉన్నారు.

నవీన్ కుటుంబానికి మాజీ సీఎం కిరణ్ పరామర్శ


నవీన్‌కుమార్‌రెడ్డి తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ సీఎం, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల నవీన్ తల్లి మరణించడంతో పరామర్శించేందుకు కిరణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాదు నుంచి వచ్చారు. వీవీ మహల్ రోడ్డులోని నవీన్‌కుమార్‌రెడ్డి ఇంటికి చేరుకుని నవీన్ తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఆయన వెంట నిఖిలేష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, అమాస రాజశేఖరరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, వెంకట ప్రసన్న, సురేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి ప్రేమ్ శివనాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బీసీ ఓట్లతోనే అన్ని రాజకీయ పార్టీలు రాజ్యాధికారం పొందుతున్నాయని, అయితే వారికి సముచిత స్థానం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. తమిళనాడులో 65 శాతం కల్పించారని, తెలంగాణలో 42 శాతం కల్పించేందుకు బిల్లు పెట్టారని గుర్తు చేశారు. ఇక్కడ కూడా ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కల్లూరు నాగరాజు, యశోద, సుబ్రహ్మణ్యం, వెంకట శివరావు గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి చరిత్రము పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఓఆర్ఐ ప్రచురించిన రఘునాథ నాయకుడు వాల్మీకి చరిత్రము పుస్తకాన్ని వీసీ అప్పారావు, ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వేంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఓఆర్ఐలో విలువైన గ్రంథాల పరిష్కరణ, డిజిటలైజేషన్, ప్రచురణ నిరంతరం జరుగుతుందన్నారు. వాల్మీకి మహర్షిగా మారక ముందు ఆయన జీవన సరళి ఈ పుస్తకంలో కనబడుతుందన్నారు. ఇటువంటి మరిన్ని విలువైన పుస్తకాలను ప్రచురించడానికి ప్రయత్నం జరుగుతోందని తెలిపారు.

కోదండరాముడి తెప్పోత్సవాలు ప్రారంభం


తెప్పలపై ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్ర పుష్కరిణిలో కోదండరామస్వామి తెప్పోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రామచంద్ర పుష్కరిణికి వేంచేపు చేశారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు విద్యుద్దీపాలతో అలంకరించిన తెప్పపై సీతారామలక్ష్మణులు ఆశీనులై ఐదు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

తుడ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రధాని చిత్రపటం


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రధాని చిత్రపటంతో బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తుడ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలను గురువారం బీజేపీ నాయకులు ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పలువురితో కలిసి ప్రధాని చిత్రపటాలతో కార్యాలయాలకు చేరుకుని గోడకు తగిలించారు. వారు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రితోపాటు ప్రధాని చిత్రపటాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, యువమోర్చా నాయకులు పార్థసారథి, జీవన్ రాయల్, చింతకాయల రవి, ఓం ప్రకాష్, చంద్రశేఖర్, దీపక్ యాదవ్, నేహా ప్రసాద్, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు జ్యోతిబా పూలే జయంతి

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలు శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. మహతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

తిరుపతి

ధనంజయులు నాయుడికి నాని నివాళి



తిరుపతిరూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడ ఎంకేనాయుడు కాలనీకి చెందిన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గాలి ధనంజయులునాయుడు కర్మక్రియలకు గురువారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరై ఆయన చిత్రపటానికి పుష్పాంజలితో నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నైపుణ్యాల పెంపుతో ఉన్నత ఉద్యోగాలు

జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు


జ్యోతి వెలిగిస్తున్న వీసీ సుదర్శన్‌రావు, పక్కనే రామిరెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల పెంపుతో ఉన్నత ఉద్యోగాలు సాధ్యమవుతాయని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు తెలిపారు. కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో తరంగ్-2కే25పేరిట నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరమని, విద్యార్థి దశలోనే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో వనరులు వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. టెక్ మహీంద్రా సీనియర్ రిక్రూట్‌మెంట్ మేనేజర్ కీర్తిసాగర్‌నాయక్ మాట్లాడారు. పలు అంశాలలో ప్రతిభచాటిన విద్యార్థులు, అధ్యాపకులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాయలసీమ విద్యాసంస్థల డైరెక్టర్ మన్నెం వెంకట్రామిరెడ్డి, శ్రీరామ ఇంజినీరింగ్ సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.జయచంద్ర పాల్గొన్నారు.

జీవకోనకు మంచి రోజులు

అక్షరం అండగా...ఆంధ్రజ్యోతి సదస్సుతో కదిలిన యంత్రాంగం - కొన్ని సమస్యలు పూర్తి, మరికొన్నింటికి ప్రతిపాదనలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా..' తిరుపతి నగరంలోని జీవకోనలో రెండు నెలల క్రితం ఏర్పాటుచేసిన సదస్సు ద్వారా స్థానిక ప్రజలు ఏకరువు పెట్టిన సమస్యలు కొన్ని పరిష్కారమయ్యాయి. మిగిలిన సమస్యలను కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించి పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జీవకోన పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీ, సత్యనారాయణపురం, సాయినగర్, క్రాంతినగర్, పార్వతీపురం, సంతోషమ్మ నగర్, శ్రీనగర్ కాలనీలు ఉన్నాయి. 5 డివిజన్లు కలిగిన ఈ ప్రాంతంలో 12వేలకు పైగా గృహాలు, సుమారు 60వేల జనాభా కలిగి ఉంది. నగరంలోని పెద్ద ప్రాంతం కాబట్టి దశలవారీగా సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.


జీవకోన ముఖచిత్రం


సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య(ఫైల్ ఫొటో)

సదస్సులో లేవనెత్తిన ప్రధాన సమస్యలు

నీటి సమస్య, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, శ్మశానాల్లో అసాంఘిక కార్యక్రమాలు, డ్రగ్, గంజాయి బ్యాచ్‌ల ఆగడాలను నిరోధించేందుకు పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు, నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు లేదా అనుభవపత్రాలు, పారిశుధ్యం వంటి ప్రధాన సమస్యలను ఆంధ్రజ్యోతి అక్షరం అండగా...కార్యక్రమంలో లేవనెత్తిన సమస్యలు.

పరిష్కారమైనవి

- నీటి సమస్య లేకుండా ట్యాంకర్లతో సరఫరా జరుగుతోంది. శాశ్వత పరిష్కారం కోసం జీఎస్ఎల్ఆర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు.
- సత్యనారాయణపురం, అమెరికన్ బార్ సర్కిల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగించారు.
- శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ముళ్ల పొదలను తొలగించారు.
- తిరుమల బైపాస్ రోడ్డు నుంచి సత్యనారాయణపురం వెళ్లే 30 మీటర్ల రోడ్డు పనులను కార్పొరేషన్ అధికారులు త్వరితగతిన చేపట్టారు. దీంతో కొంతమేర ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.
- పారిశుధ్య పనులను మెరుగ్గా చేపట్టారు. మురుగునీటి కాలువల్లో స్ప్రే చేయడంతో పాటు రాత్రివేళల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. చెత్తకుప్పలు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.
- బోర్లు మరమ్మతులు చేశారు.

అందరికీ ఇళ్లు ఇప్పించడమే లక్ష్యం

ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే

ఆంధ్రజ్యోతి సదస్సులో ప్రజలు మా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై యుద్ధప్రాతిపదికన చేయాలని అధికారులకు సూచించాం. నీటి సమస్యను తాత్కాలికంగా తీర్చే ప్రయత్నం చేశాం. జేఎంసీ ట్రస్టు ద్వారా చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. చాలాఏళ్లగా ఇళ్లు నిర్మించుకుని ఉన్న పేదలకు పట్టాలు కానీ, అనుభవపత్రాలు కానీ ఇవ్వాలని కోరారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి అనుభవ పత్రాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇళ్లులేని వారికి పక్కా ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. జీవకోనలో అవుట్ పోస్ట్ ఏర్పాటుచేయాలని పోలీస్‌శాఖకు తగు సూచనలు చేశాం.

కొన్ని పనులు చేశాం... మరికొన్ని ప్రతిపాదనలు

మౌర్య, కమిషనర్, తిరుపతి నగరపాలక సంస్థ

అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా..సదస్సులో జీవకోన ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు మా దృష్టికి వచ్చాయి. తాత్కాలికంగా నీటి సమస్యను పరిష్కరించాం. బోర్లు మరమ్మతు చేశాం. చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. శాశ్వత ప్రాతిపదికన చేయాల్సినవి ప్రతిపాదనలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించాం. వీటిలో ముఖ్యంగా రోడ్లు, డ్రైన్ల మరమ్మతులు ఉన్నాయి.

అవుట్ పోస్ట్ పరిశీలిస్తున్నాం

హర్షవర్ధన్ రాజు, ఎస్పీ

జీవకోనలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటును పరిశీలిస్తున్నాం. ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. సిబ్బంది కొరత వల్ల ఆలస్యమవుతోంది. డ్రగ్స్, గంజాయి రవాణా, వినియోగాలపై ఉక్కుపాదం మోపాం. రాత్రి వేళల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశాం. కార్డన్‌సెర్చ్‌లు, పోలీస్ నిఘాల ద్వారా శాంతిభద్రతలను అదుపులోకి తీసుకొచ్చాం.

మారుమూల గ్రామాల్లోనూ క్రీడా మైదానాలు

తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమి - ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివనాథ్

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆహ్వానం మేరకు ఆయన జీవకోన మార్గంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో యువ క్రికెటర్లతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ క్రీడాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం ముందుకెళ్లాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. మారుమూల ప్రాంతంలోనూ క్రికెట్ అభివృద్ధి చెందాలని, తద్వారా పెడదారిపట్టిన యువత దారిలో పడుతుందని అన్నారు. ఇందులో భాగంగా క్లీన్ క్రికెట్ అండ్ రూరల్ క్రికెట్ అనే నినాదంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. శాప్, క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే రెండేళ్లలో ఆంధ్రా తరపున క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి, ఇండియన్ ప్రీమియర్‌లీగ్‌లో ప్రాతినిథ్యం వహించేలా మౌలిక సదుపాయాలు సమకూరుస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో మూడు అకాడమీలు రానున్నాయన్నారు. వాటి ద్వారా ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లకు ప్లాన్ చేస్తున్నామన్నారు. తిరుపతిలో స్పోర్ట్స్ అకాడమి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అమరావతిలో మంచి స్పోర్ట్స్ సిటీ నిర్మించాలని భావిస్తున్నామన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఎమరాల్డ్స్ స్పార్క్ ఆఫ్ ద ఇయర్ రమ్య


ఎమరాల్డ్స్ స్పార్క్-25 పోటీల విజేతలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన స్పార్క్-25 స్పీచ్ కాంపిటీషన్‌లో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని రమ్య ప్రథమ బహుమతి గెలుచుకుంది. వీడియో ప్రజెంటేషన్, ఎక్స్‌టెంపోర్, గ్రూప్ డిస్కషన్ తదితర విభాగాల్లో విద్యార్థులను పరీక్షించారు. 12 మంది విద్యార్థులు ఫైనల్లో పవర్ ఆఫ్ స్మాల్ హాబిట్స్, ఆర్ట్ ఆఫ్ లిజనింగ్, ఇంపార్టెన్స్ ఆఫ్ లోకల్ లాంగ్వేజెస్, ఇంపార్టెన్స్ ఆఫ్ మ్యూజిక్ ఇన్ లైఫ్ తదితర అంశాలపై పోటీపడ్డారు. ఇందులో రమ్య ప్రథమ, బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని మోహిత ద్వితీయ, బీబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సాయికీర్తన తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి ఎమరాల్డ్స్ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీరాం బాబు, పాల్ సుధాకర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఉప సంచాలకులు మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్‌వల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్, టీడీపీ నేత పులుగోరు మురళీకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి శరత్ చౌదరి, నాయకులు రమణ యాదవ్, శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనివాసం వద్ద 500 మంది పేదలకు గురువారం అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నేత కృష్ణయాదవ్ హాజరయ్యారు. శరత్ చౌదరి మాట్లాడుతూ మురళీకృష్ణారెడ్డి పార్టీ కోసం కష్టపడుతున్నాడని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రామకృష్ణారెడ్డి, భరణీయాదవ్, దినేష్, చంద్ర, భారతి, రాజేష్, రమణ, చల్లా, తిరుమల నాయుడు, బాబు నాయుడు, తార పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మూడవ అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక కెన్నడి నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. కెన్నడి నగర్‌లోని పద్మావతి అపార్ట్‌మెంట్‌లో పి.గౌతమి (34), వెంకటేష్ దంపతులు నివాసముంటున్నారు. కొంతకాలంగా గౌతమికి మతిస్థిమితం సరిలేదు. గురువారం ఉదయం భర్త డ్యూటీకి, కుమార్తె స్కూలుకు వెళ్లిన తర్వాత మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.


మృతిచెందిన గౌతమి

మధుసూదన్ సేవలు అభినందనీయం




బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే రక్షక దళాల్లో ఐపీఎఫ్ మధుసూదన్ అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఐపీఎఫ్ కె.మధుసూదన్, ఏఎస్ఐ సునీల్ కుమార్ నాయర్ తిరుపతి నుంచి విజయవాడ క్రైం విభాగానికి బదిలీ అయ్యారు. గురువారం ఎస్వీయూ ఎదుట ఉన్న ఆర్పీఎఫ్ బ్యారెక్స్ ప్రాంగణంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విశ్రాంత అదనపు కలెక్టర్ కోదండరామిరెడ్డి, ఆర్పీఎఫ్ సహాయ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ కె.చిన్నప్పరెడ్డి, రాదయ్య, బాబురావు, మనోహరం, మాదవరావు మాట్లాడుతూ రైల్వే ఆస్తులతో పాటు, ప్రయాణికుల భద్రత, నేరస్తులను పట్టుకోవడంలో మధుసూదన్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. సమాజానికి ఆర్పీఎఫ్ అంటే ఏమిటో తెలియజేశారని పేర్కొన్నారు. అనంతరం మధుసూదన్‌ను సన్మానించారు. కాగా, రేణిగుంట ఐపీఎఫ్ సందీప్‌కుమార్‌ను తిరుపతికి బదిలీ చేశారు. అలాగే కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి వెంకటేశ్వర్లు రేణిగుంటకు బదిలీ అయ్యారు.

టీటీడీకి విరాళంగా వంద సైకిళ్లు



తిరుమల శ్రీవారికి గురువారం వంద సైకిళ్లు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన మురుగప్ప గ్రూప్ టీఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు వీటిని ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు అందజేశారు. ఈకార్యక్రమంలో పేష్కార్ రామకృష్ణ, ఇన్‌చార్జ్ డీఐ హరిబాబు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో కేంద్రమంత్రి



జ్యుయల్ ఓరం

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి జ్యుయల్ ఓరం, ఎంపీ కేశినేని చిన్ని(శివనాథ్), నిర్మాత అంబిక కృష్ణ, మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో 'అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి' బృందం

'అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి' చిత్ర హీరో కల్యాణ్‌రామ్, దర్శకుడు ప్రదీప్, నటుడు పృద్వీరాజ్, చిత్ర బృందంతో కలిసి విజయశాంతి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో ఆమె మాట్లాడుతూ, ఈ సినిమా 18న విడుదల కాబోతోందని, తప్పకుండా రెండు రాష్ట్ర ప్రజలు సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నానని అన్నారు. తమ సినిమాను అందరు తప్పకుండా చూసి ఆదరించాలని హీరో కల్యాణ్‌రామ్ కోరారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం ముందు విజయశాంతి, కల్యాణ్‌రామ్

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.27 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,076

తలనీలాలు సమర్పించినవారు: 23,699



● నేడు పెంపుడు జంతువుల దినోత్సవం

పెంచితే పంచేను ప్రేమ







కాసింత దగ్గరకు తీసుకుంటే కొండంత అభిమానాన్ని చూపిస్తాయి. ప్రేమగా సాకితే ప్రాణమే పెడతాయి. తమ చిన్ని పొట్టను నింపితే జీవితాంతం విశ్వాసం చూపిస్తాయి. అందుకే మనలో చాలామంది జంతువులు, పక్షులను పెంచుతుంటారు. వాటితో అనుబంధాన్ని ఏర్పరుచుకుంటారు. ఆ మూగజీవులతో మమేకమవుతారు. కుటుంబ సభ్యులతో సమానంగా ఆదరిస్తారు. వాటికేమైనా జరిగితే విలవిల్లాడిపోతారు. తిరుపతిలో ఎక్కువ మంది ఇంట్లో కుక్కలను పెంచుతున్నారు. కుందేళ్లు, ఎలుకలు, పిల్లులే కాదు పలు రకాలు పక్షులనూ సాకుతున్నారు. ఒకరైతే గుర్రాన్ని పెంచుతూ ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. వారిలో కొందరిని ఒకసారి పలుకరిస్తే

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)





పక్షులంటే ప్రాణం

నాకు పక్షులు, కుందేళ్లను పెంచడమంటే ఇష్టం. నా దగ్గర నాలుగు రకాల జాతుల పక్షులు(8 జతలు) ఉన్నాయి. నాలుగు జతల కుందేళ్లున్నాయి. అమాయకంగా అందంగా కనిపించే వీటిని చూస్తే అప్పటివరకు పడిన కష్టాన్ని మర్చిపోతాను. 15 ఏళ్లుగా పెంచుతున్నాను. వీటితో గడపడమంలో చాలా ఆనందాన్ని పొందుతాను. ఒత్తిడి దూరమవుతుంది..

- దుర్గాప్రసాద్, అవిలాల (తిరుపతి)

ఆ పది గుర్రాలే నా లోకం

ఆశ్వాలే నా లోకం. నా దగ్గర మార్వాడీ జాతికి చెందిన పది గుర్రాలున్నాయి. ఏడాది వయసున్నప్పుడు రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్నాను. ఒకపక్క బిజినెస్ పనులు చేసుకుంటూ గుర్రాలను చూసుకుంటున్నాను. ఒక్కో గుర్రానికి నెలకు రూ20వేలు ఖర్చవుతుంది. భారంగా భావించను. భవిష్యత్తులో గుర్రాలపై పిల్లలకు అవగాహన కల్పించాలనుకుంటున్నాను.

- కార్తీక్, బైరాగిపట్టెడ(తిరుపతి)



నాకోసం ఎదురు చూస్తాయి

చిన్నప్పటి నుంచి శనకాలంటే మహా ఇష్టం. ఇంట్లో నాలుగింటిని పెంచుకుంటున్నా. నెల జీతంలో వీటి సంరక్షణకు రూ8వేలు ఖర్చవుతుంది. వాటికి ఇష్టమైన ఆహారం పెట్టి సంతోషడతాను. అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు మందులు వాడుతున్నాను. రోజూ వాటి అవసరాలు చూసుకొని డ్యూటీకి వెళతాను. సాయంత్రం అవి ఎంతో ప్రేమగా నాకోసం ఎదురుచూస్తుంటాయి. దీంతో కష్టాన్ని మరిచిపోతుంటాను.

- శివ, కరకంబాడి(తిరుపతి)

ఆరోగ్యం విషయంలో శ్రద్ధ



తిరుపతిలో 700 మందికి పైగా పెట్ లవర్స్ ఉన్నారు. అన్ని జాతుల కుక్కలను పెంచకుంటున్నారు. పిల్లులు, కుందేళ్లను పెంచడం తక్కువ. పెట్స్‌కు టీకాల విషయంలో శ్రద్ధ అవసరం. ఎప్పుడు వేయాలో షెడ్యూల్ చేసుకోవాలి. వాటికి అనుగుణమైన ఆహారం ఇవ్వాలి. విశ్రాంతి పొందేలా సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. అవి ఫ్రెండ్లీగా, కుటుంబసభ్యులుగా మారిపోతాయి.

- డాక్టర్ నాగేంద్ర, వెటర్నరీ అధికారి, ఎంసీటీ







పెట్స్ అవసరాలు తీర్చే షాపులు పెరిగాయి

పెట్స్ హాబీ పెరిగేకొద్దీ నగరంలో వాటి అవసరాలకు అనుగుణంగా షాపులు పెరిగాయి. ముఖ్యంగా ఆహారం, మందుల షాపులు వచ్చాయి. 1991లో తిరుపతిలో వెట్‌పార్మా ప్రారంభించాను. తిరుపతిలో 14 నుంచి 15వేల పెట్స్ ఉన్నాయి. కరోనా సమయంలో వీటి సంఖ్య బాగా పెరిగింది. ఆహారానికి సంబంధించి విదేశీ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉన్నాయి. మందులతో పాటు బెల్టులు లాంటి యాక్ససరీస్‌లకు డిమాండు ఉంది.

- ఎం.శ్రీనివాసరావు, వెట్ ఫార్మా ఏజెన్సీస్, తిరుపతి



ప్రత్యేక షాపుల్లో పెట్స్ కోసం ఆటవస్తువులు, స్నాక్స్, తదితరాలు

కలికిరిలో 15న దేశవాళీ విత్తనాల పరిరక్షణ సదస్సు

● హాజరుకానున్న రాయలసీమ రైతులు

కలికిరి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ వంగడాలను పరిరక్షించి, అవసరమైతే బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు ముప్పై, నలభై ఏళ్ళ క్రితం వాడుకలో ఉన్న వరి, వేరుశెనగ, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర సంప్రదాయ వంగడాల విత్తనాలను సమీకరించి పరిరక్షించే బాధ్యతలను కలికిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అప్పగించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న అన్నమయ్య జిల్లా కలికిరిలో రాయలసీమ స్థాయి దేశవాళీ వంగడాలు సాగుచేస్తున్న రైతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని దేశవాళీ రకాలను కాపాడుకొస్తున్న రైతులు, రైతు సంఘాలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేటర్ వివరించారు. రైతులు తరతరాలుగా కాపాడుకొస్తున్న దేశవాళీ ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు (పూలతో సహా), పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తాము ప్రదర్శించబోయే రకాల గురించి ముందుగానే సమాచారం అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దేశవాళీ రకాలను సంరక్షిస్తున్న రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరేందుకు ఈ సదస్సు ద్వారా అవకాశం కలుగుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు, లేదా ఇతర వివరాల కోసం కేవీకే కోఆర్డినేటర్‌ను 8008500320 లేదా 9618934777 నంబర్లలోనూ లేదా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన (పశువైద్య విభాగం 9502888728), డాక్టర్ పీరూసాహెబ్ (సస్యరక్షణ 7989850004), డాక్టర్ ఎ.శ్రీనివాసులు (ఉద్యాన విభాగం 8008724284), డాక్టర్ మాధురి (విస్తరణ విభాగం 6303197399), డాక్టర్ ఎస్.సోమశేఖర్‌బాబు (సేద్య విభాగం 9440500167)లను సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు తుంబురతీర్థ ముక్కోటి

● ఉదయం 5 నుంచి 10 గంటల వరకే అనుమతి

తిరుమల, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్ర, శనివారాల్లో తుంబుర తీర్థ ముక్కోటి జరుగనుంది. ఈ రెండు రోజులూ తీర్థానికి ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తారు. భక్తులకు టీటీడీ పాపవినాశనం డ్యాం వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు అందజేయనుంది. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్యులు, మందులను కూడా అందుబాటులో ఉంచనున్నారు. ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, గుండె, శ్వాసకోశ సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతిలేదని టీటీడీ స్పష్టం చేసింది. ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సమీక్షించారు. ముక్కోటి రోజుల్లో గోగర్భం డ్యాం సర్కిల్ నుంచి పాపవినాశనం డ్యాం వరకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తారు. ప్రైవేట్ వాహనాలకు అనుమతిలేదని టీటీడీ ప్రకటించింది.

నిఖిత మృతిపై పోలీసుల దర్యాప్తు వేగవంతం

చంద్రగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నరసింగాపురంలో యువతి అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గ్రామానికి చెందిన నిఖిత(17) ఈనెల 4న మృతి చెందడం, ఆగమేఘాలపై కుటుంబ సభ్యులు దహనక్రియలు నిర్వహించడం తెలిసిందే. ఇది పరువు హత్యగా వెలుగులోకి రావడంతో గురువారం మృతురాలి ఎముకలను ఫోరెన్సిక్ బృందం సేకరించింది. ల్యాబ్‌కు పంపింది. ఘటన జరిగిన రోజున మృతురాలి తల్లి సుజాత ఉనికిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యులు తనకు విషం పెట్టి చంపేద్దామనికుంటుంటే విన్నానని నిఖిత తన ప్రియుడి అజయ్‌కు వాట్సప్ ద్వారా మెసేజి పంపినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది.

మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : ఏపీబీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన తిరుపతి జిల్లావాసులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని, మరిన్ని వివరాలకు 9441456039ను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయికి 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'

● తడుకు విద్యార్థుల ప్రతిభ



జేసీ, డీఈవో, జిల్లా సైన్స్ అధికారితో తో తడుకు విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం తడుకు (ఆర్ఎస్) జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' జాతీయ స్థాయిలో ఎంపికైంది. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గనిర్దేశంలో విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్ కుమార్ ఈ ప్రాజెక్టును తయారు చేశారు. వికసిత భారత్- 2047లో భాగంగా సహజ సమస్యలకు వినూత్న పరిష్కారాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేసేందుకు విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్, మౌళిక విద్యా మంత్రిత్వ శాఖ, ఆలిండియా కౌన్సిల్‌ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ (ఎస్ఐఎం) పోటీలకు శ్రీకారం చుట్టాయి. 2024 జూలై 29న పోటీలు ప్రారంభంకాగా లక్షలకు పైగా ప్రాజెక్టులు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు అందాయి. వీటిని ఐదు దశల్లో వడపోసి పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపిక చేశారు. అందులో మన రాష్ట్రం నుంచి రెండు ఉండగా.. అందులో ఒకటి తడుకు విద్యార్థులు రూపొందించిన మినీ ఫాస్ట్ కంపోస్టర్. ఈ ప్రాజెక్టుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూ. 90,500 అందించింది. ఈ మొత్తంతో ఈ పరికరాన్ని వ్యాపార పరంగా వినియోగించేలా అభివృద్ధి చేయనున్నారు.

పరికరం.. ఉపయోగాలు

మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయలను సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. వ్యర్థాలను బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరాన్ని రూపొందించిన విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ గురువారం డీఈవో కేవీఎన్ కుమార్, జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్‌తో కలిసి కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌ను కలిశారు. ఆయన విద్యార్థులను, విద్యాశాఖ అధికారులను అభినందించారు.

అమ్మవారికి కానుకగా బంగారు పట్టీలు





తిరుచానూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి కడప జిల్లాకు చెందిన డాక్టర్ రామస్వామి ఏలుమలై రెడ్డి దంపతులు రూ.10 లక్షల విలువైన 120 గ్రాముల బంగారు గజ్జెల(పట్టీలు)ను కానుకగా అందజేశారు. గురువారం ఆలయంలో ఏఈవో దేవరాజులుకు వాటిని అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

తిరుమలలో డిప్యూటీ స్పీకర్



తిరుమల/రేణిగుంట, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణరాజు గురువారం తిరుమలకు వచ్చారు. గాయత్రి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రఘురామ కృష్ణరాజు శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా శ్రీవారి దర్శనానికి వచ్చానన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తన కేసులో విచారణ ఎదుర్కొంటున్న డాక్టర్ ప్రభావతమ్మకు జ్ఞాపక శక్తిని ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థిస్తానని వ్యంగంగా అన్నారు.

17న ఆర్థిక కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్),ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 16వ ఆర్థిక కమిషన్ ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కమిషన్ పర్యటన ఏర్పాట్లపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఏర్పాట్లు, ప్రోటోకాల్, బందోబస్తు పగడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఆర్వో నరసింహులు, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, సీపీవో ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి మారణాయుధాలతో హల్‌చల్

● ప్రత్యర్థులు తప్పించుకోవంతో ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన వైనం ● ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని పోలీసులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కొరిడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మారణాయుధాలతో పక్కింట్లో ఉంటున్న దంపతులపై దాడికి ప్రయత్నించగా, వారు తప్పించుకుని పారిపోయారు. దీంతో బాధితులు కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి గోడలను కూల్చివేసిన ఘటన బుధవారం అర్థరాత్రి చోటుచేసుకొంది. స్థానికల సమాచారం మేరకు... కొరిడి దళితవాడకు చెందిన కిలివేటి మణి, కిష్టమ్మ కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నారు. వారింటి పక్కనే నివాసం ఉంటున్న కిలివేటి రవిచంద్ర బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కత్తి, గడ్డపారతో మణి ఇంటికెళ్లి నీ భర్త ఎక్కడంటూ కిష్టమ్మ ప్రశ్నిస్తూ హల్‌చల్ చేశాడు. ఒంటరిగా ఉన్న కిష్టమ్మ భయంతో భర్తకు ఫోన్ చేయడంతో మణి ఇంటి వద్దకు చేరుకోగా రవిచంద్ర దాడికి ప్రయత్నించాడు. దీంతో మణి, ఆయన భార్య కిష్టమ్మ తప్పించుకుని పారిపోయారు. దీంతో వారు కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడలను రవిచంద్ర కూల్చివేశాడు. రాత్రి సమయం కావడం, చేతిలో కత్తి, గడ్డపార ఉండడంతో ఇరుగుపొరుగువారు భయంతో మిన్నకుండిపోయారు. ఘటన జరిగిన అనంతరం బాధితులు శ్రీహరికోట పోలీసులకు సమాచారం అందించారు. గురువారం పోలీసులు కొరిడి గ్రామానికి వెళ్లి కూల్చివేసిన ఇంటిని పరిశీలించారు. జరిగిన ఘటనపై కిష్టమ్మ శ్రీహరికోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే బాధితులు, నిందితుడు బంధువులు పిలిపించి విచారిస్తామని పోలీసులు చెప్పారు.



ఇంటి నిర్మాణ గోడలను కూల్చివేసిన దృశ్యం

రేపు మాజీ ఉపరాష్ట్రపతి తిరుపతి పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం నుంచి రెండు రోజులపాటు తిరుపతి పర్యటనకు విచ్చేయనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగే 'ఒక దేశం- ఒక ఎన్నిక' సెమినార్‌లో ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హాస్టల్ బిల్డింగ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం 6 గంటలకు జాతీయ సంస్కృత విద్యాలయంలో జరిగే గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 8.20గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనం కానున్నారు.

తిరుపతి నుంచి కడప జిల్లాకు వెళ్లే వాహనాల మళ్లింపు

రాయచోటి మీదుగా నడపాలని ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి సీఎం చంద్రబాబు వస్తున్న కారణంగా తిరుపతి నుంచి వెళ్లే అన్ని వాహనాలను దారి మళ్లించారు. భాకరాపేట, పీలేరు, రాయచోటి మీదుగా నడపాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలు జారీ చేశారు. కడప నుంచి తిరుపతికి పీలేరు, భాకరాపేట మీదుగా రావాల్సి ఉంటుందని తెలిపారు. 11వ తేదీ రాత్రి 9 నుంచి 12వ తేదీ ఉదయం 9 గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు, వ్యవసాయ అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం స్థానిక రైతు సేవా సహకార సంఘ ఆవరణలో సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం రాయితీ వ్యవసాయ పనిముట్లు అందజేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రాయితీపై వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామని చెప్పారు. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 98 మంది రైతులకు రూ.18 లక్షల విలువచేసే వ్యవసాయ రాయితీ పనిముట్లను అందజేశామన్నారు. త్వరలో డ్రోన్‌లు కూడా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత, ఏవోలు కవిత, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

హుస్సేనమ్మ దర్గా గంధోత్సవం ప్రారంభం



హుస్సేనమ్మ దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

దొరవారిసత్రం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గా గంధోత్సవం గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే గంధోత్సవాల్లో మొదటి రోజు మొక్కుబడి కలిగిన భక్తులు దర్గా చుట్టూ ప్రదక్షణలు చేశారు. కొంతమంది భక్తులు దర్గా ప్రాంగణంలో నిద్రించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సీఎం చంద్రబాబు దృష్టికి మత్స్యకార సమస్యలు



ఫిష్‌కాన్ సభ్యుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పులికాట్ సరస్సు పూడికతీత గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించామని రాష్ట్ర ఫిష్‌కాన్ ఉపాధ్యక్షుడు శివాజీ తెలిపారు. గురువారం తడలో ఫిష్‌కాన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను తెలుసుకునేందుకు ఆయా జిల్లాల్లో మత్స్యకార నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమస్యలను నమోదు చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫిష్‌కాన్ రాష్ట్ర డైరెక్టర్లు శ్రీనివాసులు, వేణుగోపాల్, దాసు, పులికాట్ మత్స్యకార సంఘం నాయకులు మనోహర్, రఘు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది

డక్కిలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని డి.వడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తచెరువు గ్రామంలో 2వ విడత రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేతో దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సమావేశంలో సర్పంచు వేపమాను చెంచమ్మ, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

వాకాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు వేగవతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాలువలు, చెరువుల్లో పూడికతీత, పంట కుంటలు, నీటి తొట్టెలు, గోకులం షెడ్ల నిర్మాణం, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో విజయమ్మ, ఈసీ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జడ్జిని సన్మానించిన కోర్టు సిబ్బంది

గూడూరు అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం గుంటూరుకు బదిలీ అయ్యారు. గురువారం ఆమెను కోర్టు సిబ్బంది సన్మానించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీభవనంలో గురువారం పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీ నాయుడు, దశరధరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, రాంప్రసాద్, రవి కుమార్, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



దేశమ్మ మృతదేహం

బాలాయపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని వేణుగోపాలపురంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... కయ్యూరు పంచాయతీలోని వేణుగాపాలపురం గ్రామానికి చెందిన పోలూరు నాగరాజు భార్య పోలూరు దేశమ్మ(43) గురువారం ఇంటి వద్ద ఇనుప తీగపై బట్టలు ఆరేస్తుండగా విద్యుదాఘాతం జరిగింది. చుట్టుపక్కలవారు గమనించి ఇనుపతీగను తొలగించేటప్పటికే దేశమ్మ మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కోన పాలకవర్గం కొలువు దీరేదెన్నడో...?

- వచ్చే నెల 8 నుంచి బ్రహ్మోత్సవాలు
- చైర్మన్‌పై దృష్టి సారించని ప్రభుత్వం
- ఎమ్మెల్యేకి కత్తిమీద సాములా ఎంపిక



పెంచలకోనలోని నృసింహుడి ఆలయం

రాపూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆలయ పాలకవర్గం నియాయకంపై భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రెండేళ్లుగా పాలక మండలి లేకపోవడంతో ఆలయ అభివృద్ధి కుంటుపడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన పాలకవర్గం గడువు 2023 సెప్టెంబరు 10కి ముగిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా, ఇప్పటికీ పాలకవర్గాన్ని నియమించలేదు. కనీసం ఆలయానికి ఇన్‌చార్జిగా కూడా లేకపోవడంతో అధికారులు, సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

8 నుంచి బ్రహ్మోత్సవాలు

మే 8 నుంచి కోనలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలపై ఎమ్మెల్యేకు ఒక్క మాటైనా చెప్పకుండా అధికారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు విని పిస్తున్నాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల కోనలో పర్యటించి ఆలయం అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

కత్తిమీద సాములా చైర్మన్ ఎంపిక

కోన ఆలయ వార్షిక ఆదాయం రూ.12 కోట్లకు పైగానే ఉంది. అంతేకాక రోజురోజుకు అభివృద్ధి చెందుతుండడంతో పాలకమండలి చైర్మన్ పదవిపై అందరి దృష్టి పడింది. టీడీపీలో పలువురు నాయకులు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాలక మండలిలో ఎవరిని నియమించాలనేది ఎమ్మెల్యేకి కత్తి మీద సాములా మారింది.

కళ తప్పిన సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



గూడలిలోని సంగమేశ్వరాలయం - జనాలు రాకపోవడంతో పిల్లలకు కొడిముద్దలు పెడుతున్న వేదపండితులు

కోట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో జరుగుతున్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వెలవెల పోతున్నాయి. ప్రచార లోపం, ఉభయకర్తల దూరంతో సాదాసీదాగా జరుగుతున్నాయి. ఈనెల 5 నుంచి 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎంతో ప్రత్యేకత కలిగిన గూడలి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు. అయితే దేవదాయశాఖ ప్రచారం చేయడంలో నిర్లక్ష్యం చేసింది. ఆలయానికి పాలకమండలిని నియమించకపోవడంతో నిర్వహణ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. అంతేకాకుండా స్వామివారి హంస, శేషవాహన, నంది సేవ కార్యక్రమాలకు ఉభయకర్తలు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తూతూమంత్రంగా స్వామివారిని ఊరేగించి చేతులు దులుపుకుంటున్నారు. లక్షలాది రూపాయల విలువ చేసే 8.75 ఎకరాల ఆలయానికి మాన్యం భూములు ఉన్నాయి. ఏటా లక్షలాది రూపాయలు కౌలు వస్తుంది. అయినా బ్రహ్మోత్సవాలను సాదాసీదాగా నిర్వహిస్తుండడం పట్ల భక్తులు ఆవేదన చెందుతున్నారు.

అవిశ్వాస తీర్మానంతో కూటమికి సంబంధం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

వెంకటగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై జరిగిన అవిశ్వాస తీర్మానానికి కూటమి ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని ఏఎంసీ మాజీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణ నివాసంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన కూటమి నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటుందోన్న అక్కసుతోనే ఆ పార్టీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అవిశ్వాసం డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం గురించి చర్చించేందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కలెక్టరును కలిశారే తప్ప అవిశ్వాస తీర్మానం వాయిదా వెయ్యాలని కోరలేదని చెప్పారు. పదేపదే అసత్య ప్రచారం చేస్తే అబద్ధం నిజమైపోదన్న విషయం రాంకుమార్ రెడ్డి గ్రహిస్తే మంచిదన్నారు. ఏడాదిగా రాంకుమార్ రెడ్డి నిర్వహిస్తున్న ఏ ఒక్క పార్టీ కార్యక్రమంలోనైనా నక్కా భానుప్రియ పాల్గొన్నారా అని ప్రశ్నించారు. వైసీపీలో వర్గపోరును ఎమ్మెల్యే రామకృష్ణకు అంటగట్టడం సరికాదన్నారు. అనవసరంగా కూమి ప్రభుత్వంపై బురద చల్లడాన్ని మానుకుని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. సమావేశంలో కూటమి నాయకులు రామదాసు గంగాధరం, జంపాల ప్రకాష్, పునుగోటి విశ్వనాధ నాయుడు, మంకు ఆనంద్, కాపా శ్రీనివాసులు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, అనిల్ రామారావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించేందుకు తనవంతు చర్యలు చేపడుతున్నానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. చిట్టమూరు మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన రామ్మూర్తి గుండెజబ్బుతో బాధపడుతుండడంతో అతనికి వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.4.50లక్షల చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో దశరధరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహావీర్ జయంతి



మహావీర్ గ్రామోత్సవంలో జైనులు

గూడూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జైన్ సంఘం ఆధ్వర్యంలో గురువారం మహావీర్ జయంతి నిర్వహించారు. స్థానిక త్యాగరాజవీధిలోని జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహావీర్‌ను ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో గ్రామోత్సం జరిపారు. ప్రతిఒక్కరూ హింసా మార్గాన్ని వదిలి శాంతి మార్గంలో నడుస్తూ, సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. అనంతరం రాజా వీధిలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మిచంద్, జ్ఞానచంద్, రమేష్, మనీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై శ్రీరామచంద్రుడు



గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటి మిట్టలోని కోదండ రామాంజనేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మ వార్లను విశేషంగా అలంకరించి విశ్వక్సేనా ప్రార్థన, సుదర్శన హోమం, తిరిచ్చి ఉత్సవం జరిపారు. రాత్రి స్వామివారిని సింహవాహనంపై అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. సుమంత్‌కుమార్, సంధ్యారాణి కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

పెళ్లకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మాజీ సీఎం జగన్‌పై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యానారాయణరెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మండుతున్న ఎండలు

పెళ్లకూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే భానుడు భగ్గుమనడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం పెళ్లకూరు మండలంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం మబ్బులు కమ్ముకుని కాస్త చల్లదనంగా ఉన్నప్పటికీ ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. అవసమైతే తప్ప బయటకు వెళ్లద్దని చెంబేడు వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తప్పని సరిగా ఎండలో పనిచేయాల్సి వస్తే తలకు కాటన్ వస్త్రం ధరించాని, ఎక్కువగా నీటిని తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైతే గ్లూకోజ్, ఎలక్ట్రోల్ ఓఆర్ఎస్‌ను నీటిలో కలిపి తరచూ తాగాలన్నారు.

బీటెక్ విద్యార్థికి యూటీఎఫ్ సాయం



దినేష్ కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న బీటెక్ విద్యార్థికి యూటీఎఫ్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. కొండూరు గ్రామానికి చెందిన మీంజూరు దినేష్ అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల అనారోగ్యం భారిన పడడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స చేయించారు. దినేష్ గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడని, చికిత్సకు సుమారు రూ.60లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న యూటీఎఫ్ నాయకులు ఆ విద్యార్థికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. మండలానికి చెందిన 71మంది యూటీఎఫ్ సభ్యులు సుమారు రూ.55 వేలు సమీకరించారు. ఆ నగదును గురువారం బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సునీల, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మండల నాయకులు వెంకటేశ్వర్లు, రవికుమార్, సుధాకర్, రామ్మూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

వాకాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి అన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ సమయంలో కనీసం నాలుగుసార్లు వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. తల్లి మానసిక ఆరోగ్యం బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలోసూపర్‌వైజర్ బుజ్జమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో పోషణ్ పక్వాడ

కోట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని శ్యామసుందరపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన ఆహారంపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పోషక, విటమిన్లు కలిగిన ఆహారాన్ని ప్రయోగత్మకంగా చేసి చూపించారు.

సోమసముద్రంలో...

చిట్టమూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమసముద్రం అంగనవాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమ గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ బిడ్డ పెరుగుదల, పర్యవేక్షణ గురించి వివరించారు.

రైల్లో నుంచి జారిపడి యువకుడి మృతి



మృతిచెందిన యువకుడు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన కొండూరు గ్రామ సమీపంలో గురువారం జరిగింది. సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళుతున్న మెమూ రైలు నుంచి సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి జారి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నలుపురంగు నిక్కరు, నీలం రంగు చొక్కా ధరించి వున్నాడని, అంతకు మించి వివరాలు దొరకలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.

టెంపో ఢీకొని కూలీ మృతి

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): టెంపో ఢీకొని కూలీ మృతి చెందాడు. చెన్నై రెడ్‌హిల్స్‌కు చెందిన సుబ్రమణి(50) రైల్వే కూలీగా పనిచేస్తున్నాడు. నెల రోజుల నుంచి కొంతమంది కూలీలతో కలిసి కాచిగాడు కుప్పం వద్ద ఇంటిని అద్దెకు తీసుకుని వుంటున్నాడు. బుధవారం రాత్రి వంట సరుకులు తెచ్చుకునేందుకు బీవీపాళెం చెక్‌పోస్టు వద్దకు వెళ్లాడు. తిరిగి వెళ్లే క్రమంలో జాతీయ రహదారిని దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న టెంపో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుబ్రమణిని స్థానికులు ఎళావూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ
ముగ్గురికి గాయాలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దాచెరువు హరిజనవాడలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సుబ్బారావు కథనం మేరకు... గురువారం దాచెరువు గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణ విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంలో గ్రామానికి చెందిన సీహెచ్ రఘురామయ్య, శివప్రసాద్, రత్నయ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను నిలుపుదల చేసి, భద్రతా సర్కులర్‌ను అమలు చేయాలన్నారు. గత నాలుగేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే అమలు చేయాలని, మహిళా ఉద్యోగినులకు పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్, ప్రవీన్, కృష్ణ, గౌస్, రమేష్, సుధాకర్, శేఖర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బీజేపీ నేత వాకాటి



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాకాటి దంపతులు

తడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి దంపతులు సీఎం చంద్రబాబును గురువారం కలిశారు. వాకాటి కుమార్తె వివాహానికి ఆహ్వానం పలికేందుకు అమరావతి సచివాలయానికి వెళ్లిన వాకాటి అక్కడ సీఎం చంద్రబాబును కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన సైబర్ సెక్యూరిటీ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని విద్యా నగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగురోజుల పాటు జరిగిన సైబర్ సెక్యూ రిటీ ఫండమెంటల్స్ అండ్ ప్రాక్టికల్ అప్లికేషన్ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉన్న అవకాశాల గురించి అధ్యాప కులు వివరించారు. కార్యక్ర మంలో డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు రాజశేఖర్‌రెడ్డి, నారాయణరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మూడవ అంతస్తు నుంచి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతిలోని కెన్నడి నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. కెన్నడి నగర్‌లోని పద్మావతి అపార్ట్‌మెంట్‌లో పి.గౌతమి(34), వెంకటేష్ దంపతులు నివాసముంటున్నారు. కొంతకాలంగా గౌతమికి మతిస్థిమితం సరిలేదు. గురువారం ఉదయం భర్త డ్యూటీకి, కుమార్తె స్కూలుకు వెళ్లిన తర్వాత మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని కాపు వీధిలో వెలసిన కోదండరామ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కోదండరామస్వామి, సీతాదేవికి ఆలయ ప్రాంగణంలో వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తిరుపతి ఎస్వీసంగీత కళాశాల విద్యార్థులచే నిర్వహించిన భక్తి పాటకచేరి భక్తులను అలరించింది. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వైద్యులు సుభాషిణి, శ్రీధర్ రాజు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

వడమాలపేటలో....



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వడమాలపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక సంజీవరాయ ఆలయంలో సీతారామ లక్ష్మణ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పట్టు పీతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ప్రధాన అర్చకులు శివ, సాయి శర్మల ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శ్రీరామ నామ స్మరణల నడుమ మాంగల్యధారణ చేయించారు. భక్తి శ్రద్ధలతో తలంబ్రాళ్లు పోశారు. మహా మంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం, రాత్రి పుష్పయాగం నిర్వహించారు.

పాఠ్యపుస్తకాల అందజేత



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమ్మ

వడమాలపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, నోటు బుక్‌లను ప్రిన్సిపాల్ చంద్రమ్మ అందజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 158 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

నారాయణవనం రైల్వే గేటుకు రక్షణ గోడ నిర్మాణం



రక్షణ గోడ కోసం నిర్మిస్తున్న పిల్లర్లు

పుత్తూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణవనం రైల్వే గేటుకు ఉత్తరంగా రక్షణగోడను రైల్వే అధికారులు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో అనధికారికంగా నిర్మించిన దాదాపు 50 దుకాణాలను రైల్వే అధికారులు తొలగించారు. రైల్వే గేటు వద్ద మలుపు ఉండడంతో పాటు అనధికార నిర్మాణాల వల్ల చెన్నై వైపు నుంచి వచ్చే రైళ్లకు సిగ్నల్స్ కనపడలేదని డ్రైవర్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి రైళ్ల స్పీడు పెంచడం, అదనపు రైళ్ల ప్రవేశ పెట్టడం వంటి కారణంగా ప్రమాదాల నివారణకు రక్షణ గోడలను పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తున్నారు. దీంట్లో భాగంగా నేడు తొలగించిన దుకాణాల స్థానంలో రక్షణ గోడ కోసం పిల్లర్లను ఏర్పాటు చేశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్

పుత్తూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంగ్లీష మీడియం పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ సురేంద్ర నాయుడు, ఏజీఎం శ్రీనివాసులు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ ట్రోఫీలు, గోల్డ్ మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, కిరణ్‌కుమార్ నాయుడు, అరభి, నీలిమ, ద్రాక్షాయణి పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



సుమతి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండల పరిధిలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం ఏడీకే కల్యాణ మండలంలో పుత్తూరు మున్సిపాలిటీ, గేటు పుత్తూరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత పి.ఏలుమలై మనవరాలు జ్యోతి వివాహ నిశ్చితార్థానికి హాజరై, కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పుత్తూరు మండల పరిధిలోని క్రిష్ణసముద్రంలో విశ్రాంత రైల్వే ఉద్యోగి ఎస్.పాల్‌రాజ్ ఇటీవల మరణించగా, ఆయన స్వగృహానికి వెళ్లి పాల్‌రాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. కైలాసపురానికి చెందిన సుమతి మృతి చెందగా, ఆమె మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెంగమ్మకు నివాళి

వడమాలపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేష్ అత్త, మండలంలోని కాయంపేటకు చెందిన చెంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం కాయంపేటలో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. టీడీపీ నాయకులు చిట్టి, ఉమాపతిరావ్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ఎమ్మెల్యే చొరవతో పైపులైను ఏర్పాటు



పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్ ఎస్టీ కాలనీలో స్థానికులు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆ ప్రాంతంలో పైపులైను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం అధికారులు పైపులైను కోసం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ గత రెండు నెలల ముందు రాజీవ్‌నగర్‌లో రెండు బోర్లను కూడా వేసినట్లు తెలిపారు. పురపాలకసంఘ ఏఈ శేఖర్, వీఆర్వో, స్థానికులు గురవయ్య, సురేష్, అమరావతమ్మ, తులసమ్మ, అరుణ్, శివ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన అనంతరం వినాయక పూజ, కలశ పూజ వైదిక కతృవులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు.

సీసీ రోడ్డు పనుల అడ్డగింత



రోడ్డుకు అడ్డంగా రాయి నాటడంతో వైసీపీ సానుభూతిపరుడితో గ్రామస్థుల వాగ్వాదం

రేణిగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరుడు సీసీ రోడ్డు పనులను అడ్డుకోవడంతో గ్రామస్థులు ఆగ్రహించిన సంఘటన గురువారం మండలంలోని అన్నాస్వామిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఈప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామంలోని గ్రామ కంఠానికి చెందిన 368 సర్వే నెంబరులో సీసీ రోడ్డు నిర్మిస్తుండగా, 361 సర్వే నెంబరుకు చెందిన వైసీపీ సానుభూతిపరుడు రోడ్డుకు అడ్డంగా రాయి నాటడంతో వివాదం తలెత్తింది. దీంతో ఆ చుట్టుపక్కల గ్రామస్థులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించి, రోడ్డు నిర్మించాలని వారు కోరుతున్నారు.

వంతెన రైలింగ్‌లో ఇరుక్కున్న లారీ

- రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్

రేణిగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే వంతెన వద్ద రైలింగ్‌లో సరుకు లారీ ఇరుక్కుని ట్రాఫిక్ జామ్ అయిన సంఘటన బుధవారం అర్ధరాత్రి పాత చెక్ పోస్ట్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు సరుకు లోడుతో వెళ్తున్న లారీ రైల్వే వంతెన సమీపంలోని రైలింగ్‌లో ఇరుక్కుంది. దీంతో రేణిగుంట వైపు నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే వాహనాలు దాదాపు రెండు గంటల సేపు నిలబడిపోవడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేటి నుంచి శుకబ్రహ్మాశ్రమ వార్షికోత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో శుక్రవారం నుంచి 15వ తేదీ వరకు విద్యాప్రకాశానందగిరి 27వ పుణ్యారాధన, 112వ జయంత్యుత్సవం, 75వ ఆశ్రమ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న గురుదేవుల అధిష్ఠాన మందిరంలో శ్రీవారికి అభిషేకం, అర్చన, 12న ఆశ్రమ వార్షికోత్సవం, ఎస్వీపీ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం, 13న త్రినేత్ర వైద్యాలయ వార్షికోత్సవం, కంటి అద్దాల ప్రదానం, వైద్యులకు సన్మానం, 14న సద్గురు సర్వసేవాట్రస్టు వార్షికోత్సవం, యోగాసనాల సర్టిఫికెట్ల ప్రదానం, 15న విద్యాప్రకాశనందగిరి 112వ జయంత్యుత్సవం, పాదుకపూజ జరుగుతుందని తెలిపారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్‌సేవ



నారాయణవనం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఊంజల్‌సేవను వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని, అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట ఐపీఎఫ్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



రేణిగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఐపీఎఫ్‌గా ఎస్.వెంకటేశ్వర్లు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఐపీఎఫ్ సందీప్ కుమార్ తిరుపతికి బదిలీ కావడంతో ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ఐపీఎఫ్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు రేణిగుంటకు బదిలీ అయ్యారు. రైల్వే స్టేషన్‌లోని ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఐపీఎఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, పేట చిరంజీవి, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్, సురేష్, లక్ష్మణ్, వెంకటరమణయాదవ్, మునిచంద్ర, దినేష్, సాయి, చందు, నవీన్, వెంకటయ్య, రాజా, వీర మహిళలు లక్ష్మి, రాజ్యలక్ష్మి, శారద, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం ముక్కంటి ఆలయ

విహంగ వీక్షణం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ విహంగ వీక్షణం చూపరులను కమనీయంగా అబ్బుర పరుస్తోంది. ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు దెబ్బతినడంతో లీకేజీలు ఏర్పడిన విషయం తెలిసిందే. పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి సూచనలతో పూణేకు చెందిన భక్తుడు వెంకీ హేచరీస్ సంస్థ అధినేత వెంకటేశ్వరరావు రూ.5కోట్ల నిధులతో స్వచ్ఛందంగా ముక్కంటి ఆలయ పైకప్పు మరమ్మతు పనులను చేపట్టిన విషయం విదితమే. అత్యంత శాస్త్రీయ విధానంతో సంస్థ పైకప్పు లీకేజీ పనులను పూర్తిచేశారు. దీంతో ఆలయ పైభాగం ఎంతో సుందరంగా ముస్తాబైంది. తాజాగా పైకప్పు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. భక్తకన్నప్ప కొండపై నుంచి ముక్కంటి ఆలయ విహంగ వీక్షణ దృశ్యం భక్తులకు ఆవిష్కృతమవుతోంది.



శ్రీకాళహస్తీశ్వరాలయంపై నాడు - నేడు

రోడ్డు పక్కన భూ కబ్జాకు యత్నం



కరకంబాడిలో రోడ్డు పక్కన ఉన్న గుంటలో పూడ్చేందుకు తోలిన మట్టి

రేణిగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కరకంబాడిలో రోడ్డు పక్కన ఉన్న విలువైన భూమిని కబ్జా చేసేందుకు కొంతమంది యత్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కరకంబాడి తిరుపతి బైపాస్ రోడ్డు మార్గంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు అనుకొని ఉన్న సర్వే నెంబర్ 153/1లో 8 సెంట్లు గుంట పోరంబోకు భూమి ఉంది. ఇక్కడ గతంలోనే కొండరాళ్లను తవ్వుకొనిపోవడంతో పెద్ద ఎత్తున గుంట ఏర్పడింది. విలువైన భూమి రోడ్డు పక్కన ఉండడంతో కబ్జాదారుల కన్ను పడింది. దీంతో ఈ గుంటను మట్టితో పూడ్చి వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై కరకంబాడి వీఆర్వో దిలీప్‌ను వివరణ కోరగా.. తాను ఇటీవలనే బదిలీపై వచ్చానని, విచారించి చర్యలు చేపడతామని తెలిపారు.

ఘనంగా కుంభాభిషేక వేడుకలు



కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న సుందర సిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం కుంభాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ఆలయం నిర్మించి 14 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొత్త గోపురం నిర్మించడంతో పాటు స్వామివారికి వెండి కవచం, కలశ నిర్మాణం తదితర పనులను పూర్తి చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా కుంభాభిషేక మహోత్సవాలను ప్రారంభించారు. మూలవిరాట్‌ని వివిధ పుష్పాలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, కలశ ఆవాహనం, సిద్ధి బుద్ధి సమేత పూజలు, నక్షత్రాల పూజ, నవగ్రహ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్, కమిటీ సభ్యులు హేమభూషణం, ధన, శోభ, ఎంపీటీసీ బీబీఎస్ రెడ్డి, నాయకులు పరమశివం, శివానందం, శశి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శాంతిదుర్గ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో శాంతిదుర్గ అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాళహస్తి మండలం ఎస్ఎస్‌కండ్రిగ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల వాడకం పెంచుకోవాలని తెలిపారు. ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు, పాలు వంటివి తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు.సచివాలయ సిబ్బంది జయశ్రీ, గీత, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం అంగన్వాడీలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో దేవకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన వ్యాక్సినేషన్, ఆరోగ్యపరీక్షలు, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణవనం: బిడ్డకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ పేర్కొన్నారు. గురువారం నారాయణవనంలోని రెండవ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యం గురించి చంటి బిడ్డ తల్లుకు అవగాహన కల్పించారు. ఆరోగ్యశాఖ అధికారి రాగసుధా, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్లు జయసుధ, రమాదేవి, నాగభూషణం, నరసమ్మ, వాణి, బాలింతలు పాల్గొన్నారు.

ఎండల్లో తిరగొద్దు

● వడదెబ్బ నుంచి కాపాడుకోండి

కేవీబీపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ఎండల్లో తిరగకుండా... వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కేవీబీపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పూజాసాయి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నా కొంతమంది పనుల నిమిత్తం బయటకు వెళ్లకతప్పదని, అలాంటి పరిస్థితుల్లో ఎవరికివారు సొంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గొడుగులు, తలపై గుడ్డ, చెవులకు వడగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువ నీరు తాగుతూ ఎండ తీవ్రత లేనపుడే పనులు ముగించుకోవాలని చెప్పారు. రైతులు, కూలీలు ఉదయం, సాయంత్రం చల్లబడిన తరువాత పనులను నిర్వహించుకుని వడదెబ్బనుంచి రక్షణ పొందాలని తెలిపారు.

అధిక లోడుతో ప్రయాణిస్తే చర్యలు

కేవీబీపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాహనదారులు ట్రాక్టర్లు, లారీలు, టాటాఏస్‌లలో అధిక లోడ్‌తో రోడ్లపై ప్రయాణిస్తే చర్యలు తీసుకుంటామని డ్రైవర్లకు కేవీబీపురం ఎస్ఐ నరేష్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనానికి తగ్గ బరువుతోనే రోడ్లపై పయనించాలని, లోడ్‌లకు సంబంధించిన పత్రాలు వాహనంలో ఉండాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించేవరకు విధులకు హాజరుకాలేం



పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

రేణిగుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించేంత వరకు విధులకు హాజరుకామని పారిశుధ్య కార్మికులు స్పష్టం చేశారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా రెండోరోజైన గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బైఠాయించి నిరసన కొనసాగించారు. వీరికి ఏఐటీయూసీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ ప్రభురావు మాట్లాడుతూ సమస్యలను రాతపూర్వకంగా అందజేస్తే జిల్లా పంచాయతీ అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్మికుల యూనియన్ నాయకులతో చెప్పారు. పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగడంతో పంచాయతీలోని కుప్పతొట్టిల్లో వ్యర్థాలు, చెత్త పేరుకుపోయింది. ఈ కార్యక్రమంలో కార్మికుల యూనియన్ నాయకులు సుబ్బరాజు, చంద్రకళ, సుబ్బమ్మ, ఈశ్వరమ్మ, వెంకటేష్, మునిలక్ష్మమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఇంటి పట్టాలు ఇప్పిస్తాం



దళితులతో మాట్లాడుతున్న కన్నయ్య నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులకు ఇంటి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని టీడీపీ సీనియర్ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇంటి స్థలాల కోసం చేపడుతున్న రిలే నిరాహార దీక్షను కన్నయ్యనాయుడు గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలాల కోసం 30 రోజులుగా దీక్షలు చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి, ఇంటి స్థలాలు ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఉన్నారు.